బిల్లులు రాక.. పనులు సాగక..!

- మూడేళ్లుగా పూర్తికాని పోచంపాడ్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం
- త్వరగా అందుబాటులోకి తేవాలంటున్న విద్యార్థులు


అసంపూర్తిగా ఉన్న పోచంపాడ్ ప్రభుత్వ పాఠశాల భవనం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. బిల్లులు రాక.. పనులు ముందుకు సాగడం లేదు. దీంతో భవనం పూర్తయ్యేదెప్పుడో అంటు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోచంపాడ్ పాఠశాలలో సక్సెస్ పాఠశాలలతో పాటు ఉర్దూ మీడియం కూడా కొనసాగుతోంది. పాఠశాల భవనం రేకుల షెడ్డుతో ఉండటంతో మనఊరు – మనబడిలో పాఠశాల భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం కోటి రూపాయాల నిధులను మంజూరు చేసింది. కానీ పనులు ఆరు నెలలు ముందుకు.. ఏడాది వెనక్కు అన్నట్లు సాగుతూ వస్తోంది. ఎట్టకేలకు స్లాబ్ వరకు, ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాయి. ఇంకా కావాల్సిన పనులు ముందుకు సాగడం లేదు. పాఠశాలలో సుమారు 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం పాఠశాల రేకుల షెడ్డు భవనంలో కొనసాగుతోంది.

ప్రాథమిక పాఠశాల పరిస్థితి అంతే..

ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చాలా రోజుల తర్వాత ప్రారంభించారు. ప్రస్తుతం ఆ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్లాస్టరింగ్ ఇంకా కాలేదు. దీంతో విద్యార్థులు తరగతి గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అదనపు తరగతి గదులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బిల్లులు రాక పోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో భవనం అసంపూర్తిగా ఉంది. భవన నిర్మాణాలు నిలిచిపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాంట్రాక్టర్‌తో చర్చలు జరుపుతున్నారు. – శ్రీనివాస్, ఎంఈవో, మెండోరా

క్లుప్తంగా

సాగు చట్టాలపై అవగాహన తప్పనిసరి



నందిపేట్: రైతులు సాగు చట్టాలపై అవగాహక కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఉదయ్‌బాస్కర్ అన్నారు. నందిపేట మండలంలోని సిద్ధాపూర్‌లో మంగళవారం 'లీగల్ ఎయిడ్ క్లినిక్' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు చట్టాల గురించి న్యాయ సలహాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఆశా నారాయణ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



రెంజల్: భూభారతిలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మహతో సూచించారు. మంగళవారం రెంజల్ తహసీల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదును పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కారమైన వాటిని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి



మోర్తాడ్: ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్న దృష్ట్యా ఈ రకం పంటను సాగు చేయాలని ఉద్యానవన శాఖ అధికారి రోహిత్ సూచించారు. మంగళవారం భీమ్‌గల్ మండలం గోనుగొప్పులలో ఆయన రైతు చెరుకుపల్లి విజయేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

వర్ని: వ్యవసాయ పరికరాలు అవసరమయ్యే రైతులు సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని సత్యనారాయణపురం జీపీలో వ్యవసాయ ఆధారిత పరికరాల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ పరికరాలు అవసరమైన వారు సంబంధిత జీపీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఉపాధి హామీ వాటర్ షెడ్ కమిటీ సభ్యులు సురేశ్, వర్ని సొసైటీ చైర్మన్ సాయిబాబా, జీపీ కార్యదర్శి సాయిలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

డొంకేశ్వర్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన డొంకేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు తోట రక్షిత, డి. విశాలిని ని ప్రాఫిట్ షూ కంపెనీ ప్రతినిధులు అభినందించారు. ప్రశంసా పత్రాలు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, హెచ్‌ఎం సురేశ్ కుమార్ ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ఆర్మూర్‌టౌన్: రానున్న తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శానిటరి ఇంజినీర్ పూర్ణమౌళి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 5, 6వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసులు ఇంటి పరిసరాల్లో చెత్తను వేయొద్దని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డు అధికారులు నర్సయ్య, రాజన్న, గోపి, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకుల చిత్రపటాల బహూకరణ



వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె ఉన్నత పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాలను ఆర్మూర్ రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రజనీశ్ కిరాడ్, రాస ఆనంద్ మంగళవారం వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైద్య గణేశ్, మంచిర్యాల సురేశ్, పుష్పాకర్‌రావు, వివేకానంద్, సీవీ నరసింహారావు, కృష్ణవేణి, గణేశ్, మహేందర్, రత్నయ్య పాల్గొన్నారు.

నేటి చిత్రం



తవ్వారు.. వదిలేశారు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని చిన్నబజార్‌లో కల్వర్టు మరమ్మతుల్లో భాగంగా రోడ్డును తవ్వి పైప్ లైన్ వేసి వదిలేశారు. పది రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. – సరోజిని, చిన్నబజార్, ఆర్మూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కమ్మర్‌పల్లి: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ జి. ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే గా పాటించాలని గ్రామంలో చాటింపు చేయాలన్నారు. ఎంపీడీవో రాజ శ్రీనివాస్, నరసింహస్వామి, స్పందన, శ్రావణ్, అమీర్‌ఖాన్, కుంట గంగాధర్, విద్యానంద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోచంపాడ్‌లో..


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేశ్ సూచించారు. ప్రిన్సిపాల్ గోదావరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

రుద్రూర్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎస్సైలు సాయన్న, మహేశ్ సూచించారు. రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, మోడల్ స్కూల్‌లో మంగళవారం ఐసీడీఎస్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని గ్రామాల్లో తెలియజేయాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీలత, మణి, ఫుడ్ సైన్స్ కళాశాల డీన్ వెంకట్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చెన్నప్ప, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై సునీల్, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాలిక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమరవ్వ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్: మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడపల్లి మండల శివారులో టున్న బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఈహెచ్ డిస్ట్రిక్ మిషన్ కో–ఆర్డినేటర్ పిట్ల స్వప్న మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్, ఐసీడీఎస్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిపేట్‌లో..


అయిలాపూర్‌లో మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

నందిపేట్: యువత చెడు అలవాట్లకు లోనుకాకుండ బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేయాలని డిస్ట్రిక్ లీగల్ అథారిటీ సెక్రటరీ ఉదయ్‌భాస్కర్ సూచించారు. నందిపేట మండలం అయిలాపూర్ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, న్యాయ చైతన్య సదస్సు ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, చిన్నయ్య, స్థానిక ఎస్సై చిరంజీవి, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

వర్ని: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 27న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జీపీ కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్‌కు చలో హైదరాబాద్ నోటీసును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాజు, సాయి చరణ్, లింగయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తాం

వర్ని(మోస్రా): వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోతే వాటిని సీజ్ చేస్తామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం మోస్రా మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 69 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సైలు సునీల్, మచ్చేందర్ రెడ్డి, చంద్రమోహన్, సాయన్న, మహేశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

బోధన్‌టౌన్: బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటనారా యణ రంగారెడ్డి జిల్లాకు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ప్రమోషన్‌పై వెళ్లారు. బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా సెక్రెటరియేట్‌లో విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ బోధన్‌కు రానున్నారు.

టీబీ నిర్మూలన ధ్యేయంగా కృషి చేయాలి



పెర్కిట్: సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేశ్ సూచించారు. ఆలూర్ మండలం దేగాంలో మంగళవారం టీబీ ముక్త భారత్ వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డయాలసీస్ తీసుకుంటున్న రోగులు, పొగాకు వినియోగదారులు, వృద్ధులు, గతంలో టీబీ బాధితులుగా నమోదైన వ్యక్తులకు మళ్లీ స్క్రీనింగ్ చేయాలన్నారు. హై రిస్క్ ఉన్న వారిని గుర్తించి తగిన పరీక్షలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఆరోగ్య కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సాయన్న, ఏఎన్‌ఎం స్వప్న, టీబీ సూపర్‌వైజర్ సంతోష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీ-74 కెనాల్ ఆధునికీకరణ

- జీజీ నడ్కుడ నుంచి చిన్నయానం వరకు సీసీ లైనింగ్
- నిధుల అంచనాకు సర్వే చేసిన ఇరిగేషన్ అధికారులు


జీజీ నడ్కుడ వద్ద నిజాంసాగర్ డీ-74 కెనాల్

డొంకేశ్వర్: మండలంలోని జీజీ నడ్కుడ నుంచి చిన్నయానం వరకు కూడుకుపోయిన నిజాంసాగర్ డీ–74 కెనాల్‌ను త్వరలోనే ఆధునీకరించనున్నారు. మొత్తం మూడు కిలో మీటర్లు ఉన్న ఈ కెనాల్‌కు రెండు చోట్ల కల్వర్టులు, కిలో మీటరు పొడవునా సీసీ లైనింగ్ వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల క్రితం కెనాల్ వెంబడి సర్వేను నిర్వహించారు. దీంతో రెండు గ్రామాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐతే, కెనాల్ పనుల కోసం రూ.1.20 కోట్ల వరకు నిధులు అవసరం కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లా ఇరిగేషన్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనుండగా, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.


సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్

ఆయకట్టు 840 ఎకరాలు..

జీజీ నడ్కుడ నుంచి చిన్నయానం వరకు ఉన్న డీ–74 కెనాల్ కింద మొత్తం 840 ఎకరాలు సాగయ్యేవి. జీజీ నడ్కుడలో ఊరి మధ్యలో ఇళ్ల ముందు నుంచి వెళ్తున్న కెనాల్ కబ్జాలకు గురైంది. మురికి నీరు కూడా ఇందులోనే కలిసిపోయి పిచ్చి మొక్కలు, చెత్తతో పూర్తిగా నిండిపోయింది. దీంతో కాలువ కూడుకుపోయింది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లడం లేదు. దీంతో రైతులకు పంటలు పండించడం కష్టంగా మారింది. చాలా సార్లు పంచాయతీ సిబ్బందితో కాలువను శుభ్రం చేయిస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో ఈ విషయాన్ని స్థానికులు, రైతులు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కెనాల్ ఆధునీరకణకు సర్వే చేసి అంచనాలు తయారు చేసివ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అధికారులు సర్వే చేసి రిపోర్టు తయారు చేశారు. కెనాల్ ఆధునీకరణ పూర్తయితే ఎక్కడా ఆగకుండా 840 ఎకరాలకు సాగునీరు అందనుంది.

రైతు భరోసా సంబురాలు


ఆలూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు


ముప్కాల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు


బాల్కొండలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


వేల్పూర్‌లో కాంగ్రెస్ నాయకులు


రుద్రూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరిట రైతు భరోసా సంబురాలను మంగళవారం చేపట్టింది. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని రైతు వేదికల్లో రైతు భరోసా సంబురాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా రికార్డు స్థాయిలో తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అండగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


రెంజల్ మండలం సాటాపూర్‌లో..


డొంకేశ్వర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

సంక్షిప్తం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ: సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేశ్, ఎస్‌వో వినోద, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై ఎస్సై నరేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజీయొద్దీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలు లేక ప్రమాదాలు

రెంజల్(నవీపేట్): పార్కింగ్ స్థలాలు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని నవీపేట్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం స్థానిక ఎస్సై, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు అందించారు. రోడ్డుపై నిలుపుతున్న వాహనాల పై తగిన చర్యలు తీసుకునాలని అధికారులకు అందించిన వినతిపత్రంలో కోరారు.

వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బృందావని థియేటర్ సమీపంలో మంగళవారం ట్రాఫిక్ ఎస్సై రఘుపతి వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

28న జగన్నాథ రథయాత్ర మహోత్సవం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఈ నెల 28న ఆర్మూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ సభ్యులు తెలిపారు. రథయాత్రను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

తపాలా పథకాలపై అవగాహన సదస్సు

వేల్పూర్: వేల్పూర్ జీపీ కార్యాలయంలో మంగళవారం తపాలాశాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. పోస్టాఫీస్ పథకాలు, గ్రామీణ తపాలా జీవిత బీమా గురించి వివరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఆనంద్, రాజన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పీఎస్ పరిధిలో పొగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ బాధితులకు మంగళవారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లను సేకరించి బాధితులకు అందించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని వ్యాపారులు, హోటల్, స్వీట్, బేకరీ దుకాణాల వారు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బంది హెచ్చరించారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం పలు దుకాణాలను మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ బిల్లులపై ఆందోళన వద్దు

బాల్కొండ: ఇందిరమ్మ బిల్లులపై లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని ముప్కాల్ ఎంపీడీవో నరేశ్ ఆనంద్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలోని జీపీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఇసుక కొరత ఉంటే సమచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్‌మొయినొద్దీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాదాపూర్ పెద్ద చెరువు పరిశీలన

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ పెద్ద చెరువును ఇరిగేషన్ డీఈ రవికుమార్ మంగళవారం పరిశీలించారు. గుత్ప ఎత్తిపోతల నీటిని మాదాపూర్ పెద్ద చెరువులోనికి వచ్చేలా చూడాలని రైతులు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు డీఈ చెరువును పరిశీలించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం..

బోధన్: సాలూర మండల కేంద్రంలో గ్రంథాలయ శాఖ నూతన భవన నిర్మాణానికి తహసీల్దార్ శశిభూషణ్ గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, మాజీ చైర్మన్ శివకాంత్ పటేల్, ఏఎంసీ డైరెక్టర్ సంగెపు భూమయ్య, శివాలయ కమిటీ చైర్మన్ లోకప్పగారి లక్ష్మణ్ పటేల్, మాజీ ఉపసర్పంచ్ డిస్కో సాయిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి స్థలం..

మోర్తాడ్: వన మహోత్సవ కార్యక్రమంలో భా గంగా మొక్కలను నాటడానికి అనువైన స్థలా న్ని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం జాగిర్యాల్‌లో పరిశీలించారు. మొక్క లు నాటి వాటిని సంరక్షించడానికి చర్యలు తీ సుకోవాలని పంచాయతీ ఉద్యోగులకు సూచించారు. ఏపీవో నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌టౌన్: నాయీబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని రిటైర్డ్ ఇంజినీర్ లింగంపల్లి శివానందం అన్నారు. మంగళవారం బోధన్‌లోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో శ్రీసాయి నాయిబ్రహ్మణ సంఘం– ఆజాంగంజ్ ఆధ్వర్యంలో బోధన్ మున్సిపల్‌లో డీఈగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన లింగంపల్లి శివానందం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేశ్, పాయల్ శంకర్, జహంగీర్, ఆంజనేయులు, సాయిలు, యోగి, బాబు, రమేశ్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోధన్‌రూరల్: నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని పెగడపల్లి వద్ద పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ మంగళవారం తెలిపారు. పట్టుబడిన వాహనాన్ని సీజ్ చేసి కేసు నయోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

మోర్తాడ్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన జాగిర్యాల్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఐదు విడతల్లో రూ.5లక్షల సాయం అందుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి, ఏపీవో నర్సయ్య తదితరులు ఉన్నారు.

రెంజల్‌లో..

రెంజల్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగభూషణంరెడ్డి సూచించారు. బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్మె శ్రీనివాస్, నాయకులు సాయిబాబాగౌడ్, ఆసాని అనిల్, సగ్గ వెంకటి, సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.